

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### కలహాంతరిత

"**మనిషి పుటక పుట్టాక** సిగ్గూ శరం వుండాలి..." కాఫీ గ్లాసులని చప్పుడయ్యేలా బల్లమీద పెడుతూ అరిచింది తులసి.

రాఘవ ఎప్పట్లాగే తలవంచుకుని కూర్చున్నాడు. తనముందే తమ్ముడ్ని తిట్టడం గోపాలానికి కష్టంగా అనిపించినా, నెమ్మదిగా అడిగాడు.

"ఐతే ఏమంటావు? వాడికి ఒకత్తే కూతురు. మనకి ఒకడే పిల్లాడు. ఇద్దరిళ్ళ ఆడపడచు అదే కదా? దాని పెళ్ళికి సాయం చేస్తే నీ సొమ్మేం పోయింది?"

"నా సొమ్మేం పోదు. మీ పరువే పోతుంది" ఘాటుగా జవాబు చెప్పింది తులసి.

"తమ్ముడు కూతురి పెళ్ళికి సహాయం చేయకపోతే పోతుందేమోకానీ చేస్తే ఎందుకు పోతుంది?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం.

"మీ కొడుకేం చదువుతున్నాడు?"

"డాక్టరీ. మెడిసిన్"

"ఆ పిల్లకి చూసినవాడు?"

"టీచర్"

"అదే మరి. పంచాయితీ గుమస్తాగా తను పడే సుఖం తన కూతురు కూడా అనుభవించాలనేమో పంతులు సంబంధం తెచ్చాడు. అదీ గవర్నమెంట్ పంతులుకాదు. ప్రైవేట్ బడిలో పంతులు. ఇంతోటి సంబంధానికి కట్నాలు, కానుకలు, లాంఛనాలు.. ఆయన అడగడం మీరు అభయం ఇవ్వడం" ఈసడింపుగా చెప్పింది తులసి.

"అబ్బా! డొంక తిరుగుడు లేకుండా చెప్పు. ఐతే ఏమంటావు?"

"ఊరంతా, గోపాలం కొడుకుని డాక్టరీ చదివిస్తూ, తమ్ముడి కూతురికి బతకలేని బడి పంతుల సంబంధం చేసాడని చెప్పుకోవడం నీకు ఇష్టమైతే సరే ఏం కట్నాలు, ఏ సారెలు ఇస్తావో ఇచ్చుకో" తులసి లోపలికి వెళ్ళిపోయింది.

"ఏమీ అనుకోకురా రాఘవ. మీ వదిన సంగతి తెలుసుగా మనసు వెన్నపూస. మాట కొంచెం కరుకు."

"నేను వెళ్ళి వాళ్ళకి తూగలేమని చెప్పి వస్తా అన్నయ్యా."

రాఘువ ఖాళీ కాఫీ గ్లాసుని బల్లమీద పెట్టి లేచాడు.

తమ్ముడు భార్య మాటలకి బాధపడుతున్నాడని అర్ధమైన గోపాలం నిస్సహాయంగా చూసాడు.

"తులసీ"

"ఊఁ"

వెనక్కి తిరిగిన భార్యని చూసి, అందామని మనసులో పదిసార్లు మననం చేసుకున్న మాటలు మాయమయ్యాయి ఆమె సౌందర్యానికి అతను ఎప్పుడూ దాసుడే

"ఏంటి?" రెట్టిస్తూ అడిగింది తులసి.

"ఏమీలేదు. పాపం వాడిని ఎందుకు అంత బాధపెట్టావు? ఇది పిల్లకి తగిన సంబంధం కాదని ఒక్కమాట చెపితే అయిపోయేదిగా?" అనునయంగా అడిగాడు.

ఆ ప్రసక్తి రాగానే అప్పటివరకు ప్రశాంతంగా వున్న తులసి మొహం కోపంతో ఎరుపెక్కింది. గోపాలమే మళ్ళీ అన్నాడు..

"చూడు. పిన్ని వీడు పుట్టినప్పుడే పోవడం, బాబాయ్ ఇంకో పెళ్ళి చేసుకోవడంతో వీడు మా ఇంట్లోనే పెరిగాడు. మనకిలాగానే అమ్మకి నేను, పిన్నికి వాడు. కుటుంబానికి ఒకళ్ళం. ఎంత ప్రేమగా పెరిగామో తెలుసా? నాన్న కొంత భూమి ఇస్తానన్నా ఒప్పుకోలేదు. మమ్మల్ని వదిలి వుండలేక ఆ పంచాయితీ గుమస్తా వుద్యోగం చేస్తున్నాడు కానీ, వాడు చదివిన చదువుకి కలెక్టర్ అయ్యేవాడు తెలుసా.."

"తెలియని కొత్త విషయం ఏదైనా వుంటే చెప్పండి." తులసి పెడసరంగా చెప్పింది.

"నువ్వు వాడిని చూస్తే కళ్ళల్లో నిప్పులుపోసుకుంటావు. వాడివల్ల మన ఆస్తి అంతస్థులకేం ప్రమాదం లేదు. ఆస్తిలో వాటా అడగడానికి వాడు నా తండ్రి తమ్ముడి కొడుకు కాదు. అమ్మ చెల్లెలి కొడుకు. నాకు దాయాది కాదు."

తులసి విసురుగా లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంది.

"ఏమే బృందా ..అమ్మ రాలేదా?"

పేరంటంలో కూర్చున్న తులసి ఆ మాటలు విని తలతిప్పి చూసింది.

"లేదు అత్తయ్యా. మళ్ళీ ఆ పార్శ్వపు నొప్పి వచ్చి పడుకుంది" రాఘువ కూతురు బృంద సన్నటి గొంతుతో సమాధానం చెప్పింది.

"ఏంటో చిన్నప్పటి నుంచి రాఘువకి అన్నీ కష్టాలే. వున్న కష్టాలకి తోడు ఈ రోగిష్టి పెళ్ళాం. రెండు రోజులు లేస్తే మూడు రోజులు పడుకుంటుంది" ఓ పెద్దావిడ సానుభూతిగా చెప్పింది.

"తెలివితేటలు కూడా లేవమ్మ. ఒట్టి మేధకురాలు." ఓ ఇల్లాలు తనవంతు మాట చెప్పింది.

బిడియంగా లోపలికి వచ్చిన బృంద తులసిని చూసి చిరునవ్వు నవ్వి ఆమె పక్కన కూర్చుంటూ అడిగింది.

"కులాసానా పెద్దమ్మా? పెదనాన్న, అన్నయ్య బావున్నారా?"

తులసి అన్నిటికీ సమాధానంగా తల వూపింది. ఆమెవంక నిశితంగా చూసింది.

బోసిమెడ, చేతులకి పట్టుగాజులు, సామాన్యంగా వున్న లంగా ఓణీ, బిగించి వేసిన బారుజడ. అలక గృహంలోని లక్ష్మీదేవిలా వుంది.

ఓ నిమిషం ఆలోచించి మెడలోంచి చంద్రహారం తీసి బృంద మెడలో వేసింది. ఆమె కంగారుగా చూస్తుండగానే చేతికున్న డజను గాజుల్లోంచి అరడజను తీసి రెండు చేతులకీ తొడిగి కటువుగా చెప్పింది.

"పిల్లనిట్లా మూసివాయనం ముత్తయిదువులా చూపిస్తే బడి పంతులు కాక జమిందారు వస్తాడా?"

బృంద సంభ్రమంలోంచి తేరుకోకుండానే తులసి లేచి తాంబూలం తీసుకుని వెళ్ళిపోయింది.

భర్త ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా వినిపించి వసారాలోకి తొంగి చూసిన తులసికి చెక్కకుర్చీలో కూర్చున్న రాఘవ కనిపించాడు. తక్షణం ఆమె కళ్ళల్లో ఎర్రజీరలు తొంగి చూసాయి.

"తులసీ. ఓ తులసీ తొందరగా ఇటురా" గోపాలం గావుకేకపెట్టాడు.

"ఏమిటి?"

"బృందకి డాక్టర్ సంబంధం తెచ్చాట్ట రాఘవ. అబ్బాయి గవర్నమెంట్ హాస్పిటల్‌లో పనిచేస్తాడుట" ఆనందంగా చెప్పాడు గోపాలం.

రాఘవ ఓసారి తలెత్తి ఆమె వంక చూసి మళ్ళీ తలదించుకున్నాడు.

"కుదిరితే చేయండి అందులో నాకు చెప్పడానికేముంది?" విసురుగా చెప్పింది తులసి.

"వాళ్ళు కొంచెం కట్నకానుకలు ఎక్కువే అడిగారుట." నసుగుతూ చెప్పాడు గోపాలం.

"రేపు మీరు అడగరూ మీ కొడుక్కి? స్థోమత వుంటే చేయండి లేదా ఓ దణ్ణం పెట్టి వూరుకోండి."

"ఎవరికి స్థోమత? నాకా? ఇలాంటి పెళ్ళిళ్ళు వంద చేయిస్తా ఏమనుకుంటున్నావో "రోషంగా చెప్పాడు గోపాలం.

"ఐతే చేయించండి. నా సొమ్మేం పోయే" తులసి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"తులసీ" అనునయంగా పిలిచాడు గోపాలం.

"ఏమిటి?" తులసి ప్రసన్నంగా అడిగింది.

"పాపం బృంద పెళ్ళి ఇంకో పదిరోజులే వుందా?"

"పాపం ఏమొచ్చెకాని విషయం చెప్పండి."

"మరదలు రోగిష్టి మనిషని తెలుసుగా ఇంటా బయటా ఒక్కడే చేసుకోలేక రాఘవ తంటాలు పడుతున్నాడు. నువ్వుకాస్త పెద్ద మనసు చేసుకుని ఇంట్లో పనులు చక్కపెడితే...."

"అంటే నాది చిన్న మనసన్నమాట, మీరేమో పెద్ద దానకర్ణులు. నేను శూర్పణఖ అంతేగా?" గయ్‌మంది.

"అహ. అలా అనికాదు. పెళ్ళికూతురైన బృందే పూనుకుని చేస్తోందిట వాళ్ళ నాన్న బాధ చూడలేక."

"సరే. నాకు ఆడపిల్లలు లేకపోయినా ఆడపెళ్ళివారి చాకిరీ తప్పదన్నమాట. కానీ ఓ మాట. తీరా అంతా చేసాక, ఇట్లా చేసావు, అట్లా చేసావు అని నన్నెవరూ దెప్పిపొడవకూడదు" ఒప్పుకుంది.

"నువ్వు చేసే పనిలో వంక పెట్టడమా? నువ్వు పూనుకోవాలి కాని క్షణాల మీద జరిగిపోవు?" గోపాలం భార్యని అభిమానంగా చూస్తూ చెప్పాడు.

బృంద పెళ్ళి ధూంధాంగా జరిగిపోయింది. పెళ్ళివారికి చేసిన మర్యాదలు, పెట్టిన పెట్టుబడులు, భోజనాలు సారెకింద ఇచ్చిన పదార్థాల పరిమాణాల గురించి వూరి జనం వారంరోజులపాటు చెప్పుకుంటూనే వున్నారు కానీ వీటి వెనక వున్న సూత్రధారి తులసి మాత్రం పెళ్ళికి వెళ్ళలేదు.

"నాకు తలనొప్పిగా వుంది. నేను రాను. మీరు, పిల్లాడు వెళ్ళిరండి" భర్తకి చెప్పింది.

కొత్త బట్టలు ధరించి ఒంటికి అత్తరు పూసుకుంటున్న గోపాలం తెల్లబోయాడు.

"అదేంటి? పదడుగులు వేస్తే రామాలయం ఓ నిమిషం వచ్చి అక్షింతలు వేసి ఆశీర్వదించి రావచ్చుగా?"

"అడుగుదీసి అడుగు కూడా వేయలేను. మిమ్మల్ని వెళ్ళమంటున్నానా?" అసహనంగా అరిచింది.

ఆమె పట్టుదల తెలిసిన గోపాలం మారుమాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

విషయం తెలిసిన బృంద పెళ్ళికూతురి అలంకరణలోనే వచ్చి ప్రాధేయపడింది.

"పెద్దమ్మా నాకోసం రావచ్చుగా?"

"రాలేను, తలబద్దలవుతోంది."

నీరసంగా లేచి బృందకి బొట్టుపెట్టి చెప్పింది.

"అబ్బాయి బావున్నాట్ట అన్నయ్య చెప్పాడు. మంచివాళ్ళని పెదనాన్న చెప్పాడు. హాయిగా కాపురం చేసుకో."

చివరికి పడుతూ లేస్తూ బృంద రోగిష్టి తల్లి వచ్చింది తులసి ఆవిడ మొహం కూడా చూడలేదు. దుప్పటి నిండా ముసుగు పెట్టిపడుకుంది. ఆవిడ కొద్దిసేపు బతిమిలాడి వెళ్ళిపోయింది.

"జంట ఎంత చూడచక్కగా వుందనుకున్నావ్? కాకపోతే కన్యాధార పోసే సమయానికి మరదలు కళ్ళు తిరిగిపడిపోయింది. రాఘువేమో, 'నువ్వూ వదిన పీటల మీద కూర్చుని జరిపిస్తారనుకున్నాను' అని ఒకటే బాధపడ్డాడు. ఈ మధ్య నీకు మరీ మంకుపట్టు ఎక్కువైంది తులసీ." పెళ్ళినించి వచ్చిన గోపాలం నిష్ఠూరంగా చెప్పాడు.

రోజూ వుదయం రాఘువ వచ్చి గోపాలంతో కబుర్లు చెప్పి, కాఫీ తాగి వెళ్తూనే వున్నాడు. ఆ కబుర్లలో ఇప్పుడు బృంద కాపురం గురించిన విశేషాలే ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

"అత్తామామలు చాలా మంచివాళ్ళట."

"అల్లుడు ప్రతీ సాయంత్రం సినిమాకో షికారుకో తీసుకెళ్తున్నాట్ట."

"అమ్మాయి వంటని అంతా మెచ్చుకుంటున్నారుట."

ఈ సంభాషణలు చెవిన పడినా తులసి పట్టించుకోదు. కల్పించుకోదు. శబ్దమయ్యేలా కాఫీ గ్లాసులు టక్కున బల్లమీద పెట్టి వెళ్ళిపోయింది అంతే.

వీధిలో ఏవో అరుపులు వినబడ్డాయి. పేపర్ చదువుతున్న గోపాలం దాన్ని పక్కన పడేసి బయటకి పరిగెత్తాడు.

పాలగిన్నె కిందమంటని తగ్గించి తులసికూడా కంగారుగా బయటకి వచ్చింది.

"ఏం జరిగిందిరా?" ఎదురుగా కనబడ్డ పాలేరుని అడిగింది.

"మన రాఘువ బాబుగారు చచ్చిపోయారంటమ్మా" వాడు దుఃఖంగా చెప్పాడు.

"ఏమిటి?" తులసి నిశ్చేష్టురాలైంది.

"ఏడుగంటలైనా ఇంకా లేవడేంటని ఆరి భార్యగారు లేపారంటమ్మా. చూస్తే ఒళ్ళు చల్లగా వుందంట. ఆవిడ కేకలు పెడితే పక్కవాళ్ళు వచ్చి చూసారంట. రాత్రి నిద్రలోనే ప్రాణం పోయి వుంటాది అంటున్నారు."

తులసి కలలో నడుస్తున్నట్లుగా లోపలికి వచ్చింది. తన గదిలోకి వెళ్ళి గడియపెట్టింది. గోడవార బల్లమీద వున్న చిన్న ట్రంకు పెట్టె దగ్గరకి వెళ్ళి వంగి, మెళ్ళోని మంగళసూత్రాలకి కట్టివున్న చిన్న తాళం చెవితో దాని తాళం తీసింది. మూత తెరవగానే లోపలవైపు మూతకి అతికించిన యవ్వనంలోని రాఘవ ఫోటో కనిపించింది. చిరునవ్వులు చిందిస్తున్న అతని మొహం చూడగానే ఆమె మనసులో గూడు కట్టుకున్న దుఃఖం ఒక్కసారిగా బద్దలైంది.

"మోసం చేసావు రాఘవా! మళ్ళీ మోసం చేసావు. 'తులసి బాగుంది నాకు నచ్చింది' అని అన్నగారు అనగానే మన ప్రేమని ముక్కచెక్కలు చేసావు. పెంచిన ఋణం, సొంత అన్నలాంటివాడని నా మెడలు విరిచావు. నీ అన్న ఋణం నేనెందుకు తీర్చాలి' అని అడిగే తెలివి తేటలు ఆనాడు లేకుండా పోయాయి."

తులసి ఆ పెట్టెలో కట్టలు కట్టి వున్న ఉత్తరాలని తీసుకుని నేలమీద కూలబడింది. వాటిని చూసేకొద్దీ ఆమె దుఃఖం ఎక్కువైంది.

"ఎన్ని కలలు కన్నాం రాఘవా. అంత చదువు చదివి ఈ పల్లెటూరిలో పంచాయితీ గుమాస్తాగా చేరింది కేవలం నన్ను చూడాలనేకదా రాఘవా! మరి రేపటినుంచి నన్నెవరు చూస్తారు? నా చేతి కాఫీ ఎవరు తాగుతారు? వంటింటి కిటికీలోంచి నేనెవర్ని చూడాలి? ఎందుకింత మోసం చేసావు? అర్థం లేని త్యాగాలతో మన జీవితాలని నాశనం చేసావు. చచ్చేదాకా మొహంలోకి సూటిగా చూడలేకపోయావు."

ఆమె దృష్టి ఓ ఉత్తరంలో రాసిన "నా తులసీ.. బృందావనీ" అన్న పదాల మీద పడింది. శోకం ఉధృతమైంది.

"అయ్యో! నీ కూతురికి నా పేరే పెట్టుకున్నావు. నా చేతులమీదుగా పెళ్ళి జరిపించాలనుకున్నావు. కానీ ఓడిపోయాను రాఘవా నీ మీద ద్వేషం పెంచుకుంటే ప్రేమ చచ్చిపోతుందనుకున్నాను. నిన్ను ద్వేషించాను. నీ మీద నిప్పులు కురిపించాను నీ మౌనం చేతకాని తనం కాదని, పశ్చాత్తాపం అని తెలిసీ సాధించాను. నీ పక్కన ఇంకో ఆడది కూర్చోవడం చూడలేక నీ పెళ్ళికి రాలేదు. నీ కూతురి పెళ్ళికి రాలేదు. అసలు దాని మొహం చూడడానికే ఇష్టపడలేదు. ఇప్పుడు ఆ ఆడది నీ మీద పడి ఏడుస్తూంటే ఎట్లా చూడగలను?....

కంటికి మింటికి ఏకధాటిగా, రాళ్ళు కరిగేలా తనే కరిగి నీరై పారేలా తులసి ఏడుస్తూనే వుంది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

**Click here to share your comments on this story**